





# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 27

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 3 జూన్ 2025


# కొల్లేరు ప్రజల సమస్యకు మానవీయ కోణంలో పరిష్కారం - ముఖ్యమంత్రి చంద్రబాబు

● రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 5న కోటి మొక్కల ప్లాంటేషన్



**అమరావతి,కలంకౌంటర్ :** పర్యావరణపరంగా కీలకమైన కొల్లేరు సరస్సును పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇదే సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజల సమస్యలను మానవీయ కోణంలో చూసి పరిష్కరించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. కొల్లేరుపై కోర్టు తీర్పులు, నిబంధనలు, కేంద్ర సంస్థల ఆదేశాలు, స్థానిక పరిస్థితులు, పర్యావరణ, కాంటూరు అంశాలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్షించారు. కొల్లేరు పరిధిలో మూడు లక్షల మంది ప్రజలు ఉన్నారు... కొల్లేరు కాంటూరు పరిధి అంశంలో చాలా కాలంగా వీరు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరి సమస్య పరిష్కారం కోసం 2014 నుంచి 2019 మధ్య నాటి తెలుగుదేశం ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా 2018లో నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు 20 వేల ఎకరాల జరాయితీ, డీ పట్టా భూములను కొల్లేరు పరిధి నుంచి మినహాయించి కొత్త సరిహద్దులను నిర్ధారించాలని చెప్పింది. ఈ మేరకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి సిఫారసు కూడా చేసింది. అయితే దీనిపై కొందరు అభ్యంతరాలు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. కొల్లేరు సమస్య పరిష్కారంపై పట్టుదలగా ఉన్న కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆ ప్రాంతం ఎమ్మెల్యేలతో సమీక్ష చేశారు.

**కాలుష్య ప్రక్రియకు అడ్డుకట్ట పడాలి...** ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...'కొల్లేరు కాలుష్య కాసారం కాకుండా చూడాలి. కొల్లేరులోకి వెళ్తున్న డ్రైన్ వాటర్‌కు ట్రీట్మెంట్ జరగాలి. విచ్చల విడిగా డ్రైన్లు వదిలేసి కొల్లేరును కాలుష్యమయం చేసే ప్రక్రియకు బ్రేక్ పడాలి. డ్రైన్‌లో పూడికలు తొలగించాలి....నీరు సులువుగా వెళ్లే అవకాశం కల్పించాలి. కొల్లేరు నుంచి నీటిని సముద్రంలోకి తీసుకువెళ్లే ఉప్పుటేరు అక్రమణలను తొలగించాలి. ఉప్పుటేరు పూడిక తీసి, ఆక్రమణలు తొలగించి నీరు సముద్రంలోకి వెళ్లేలా చేయాలి. అవుట్ లెట్లు పూర్తిగా క్లియర్ చేయాలి. ఈ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాలి" అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కొల్లేరు రైతుల సమస్యలపై మాట్లాడుతూ.... "కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ఉన్నాయి. కాంటూరు సమస్య నేపథ్యంలో ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సీఈసీని, సుప్రీంకోర్టు ముందు ఉంచి వారిని ఒప్పించాలి. పక్షులు, పర్యావరణంతో పాటు ప్రజలకు కూడా న్యాయం జరిగేలా కార్యాచరణ ప్రారంభించాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు. సమీక్షకు చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో పాటు అధికారులు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు.

**జూన్ 5నకోటి మొక్కల ప్లాంటేషన్..** రాష్ట్రంలో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు సచివాలయంలో సీఎం చంద్రబాబు ఈ అంశంపై సమీక్షించారు. ఈ నెల 5న కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇందులో కలెక్టర్లు, మంత్రులు, ప్రజాప్రతినిధులందరూ భాగస్వాములవ్వాలని కావాలని, విద్యాసంస్థలు, వైద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్ స్టేషన్లు, రహదారులకు ఇరువైపులా ట్రీ గార్డులతో ప్లాంటేషన్ చేయాలని అన్నారు. రాష్ట్రంలో ఇది గతేడాది 29 శాతం వరకు గ్రీన్ కవర్ ఉందని, ఈ ఏడాదికి 30.5 శాతానికి పెరిగిందని సీఎం అన్నారు. ఉద్యానవనాల సాగు, అటవీ ప్రాంతంతో సహా రాష్ట్రంలో పచ్చదనం 2033 నాటికి 37 శాతానికి, 2047కి 50 శాతానికి చేరుకునేలా

- 2లో

# జాతీయ స్థాయిలో మసూలా బీచ్ ఫెస్టివల్

● 5 నుంచి 8 వరకు ● 24 రాష్ట్రాలు నుంచి క్రీడాకారులు రాక ● 100 అడుగుల జాతీయ జెండా ● సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శన శాలలు ● ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కి ఆహ్వానం ● రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఈనెల 5 నుండి 8 వ తేదీ వరకు మంగినపూడి బీచ్ లో మసులా ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయే విధంగా అత్యద్భుతంగా నిర్వహిస్తామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం మంత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావుతో కలిసి నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో మసుల ఉత్సవాల ఏర్పాట్లపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం ఈనెల 5, 6, 7, 8 తేదీలలో 4 రోజులపాటు మంగినపూడి బీచ్ లో మసుల ఫెస్ట్ 2025 నిర్వహిస్తున్నామన్నారు. భారతదేశంలోనే అతిపెద్ద ఉత్సవంగా పర్యాటక పురోభివృద్ధి దిశగా అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు ఈ ఉత్సవాల్లో భాగంగా జల క్రీడలు, సాహస క్రీడలు, వినోద కార్యక్రమాలు, బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ వంటి జాతీయ క్రీడలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీలలో 24 రాష్ట్రాల నుండి స్త్రీ, పురుష క్రీడాకారుల బృందాలు పాల్గొంటున్నాయన్నారు. కయాకింగ్ జల క్రీడలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలిసారిగా మంగినపూడి బీచ్ లో నిర్వహిస్తున్నామన్నారు. జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుండి ఉత్తమ క్రీడాకారులు 2000 మంది వస్తున్నారన్నారు. ఈనెల 5 వ తేదీన ఉదయం 9 గంటలకు మసులా వుత్సవాలు ప్రారంభిస్తామని, అందులో భాగంగా 60 అడుగుల అమరావతి అసెంబ్లీ టవర్ ను పోలి ఉన్న ముఖద్వార నిర్మాణాన్ని తొలుత ప్రారంభిస్తామన్నారు. తదుపరి 100 అడుగుల జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేస్తామన్నారు. అదే రోజు సాయంత్రం వివిధ రకాల ప్రదర్శనశాలలు ప్రారంభిస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్రస్థాయిలో పలువురు ప్రముఖులు రాబోతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని, ఇతర ప్రముఖులను, వివిధ రాష్ట్రాల ప్రముఖులను ఉత్సవాలకు ఆహ్వానించామన్నారు. ఈనెల 3 వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు కోనేరు సెంటర్ నుండి లక్ష్మీ టాకీస్ వరకు 2 కిలోమీటర్ల పరుగు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరుగులో భైరవం చిత్ర యూనిట్ నారా రోహిత్, మంచు మనోజ్ , బెల్లంకొండ సాయి శ్రీనివాస్, దర్శకులు పాల్గొంటున్నారన్నారు. వినోద కార్యక్రమాలు ఈనెల 6 వ తేదీ సాయంత్రం నుండి మొదలవుతాయన్నారు. ప్రముఖ సంగీత కళాకారులు, సినిమా కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. తెలుగు సంస్కృతి ప్రతిబింబించే విధంగా కలంకారి వస్త్రాలు, ఏటికొప్పాక వస్తువులతో పాటు 100 ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల ఆహారపు అలవాట్లకు తగ్గట్టుగా పలు రకాల వంటకాలను ప్రదర్శనశాలల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్సవాలకు వచ్చే పర్యాటకులకు రాకపోకలకుగాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పక్కాగా చేస్తామన్నారు ఈసారి పోలీసులను ఎక్కువగా వినియోగించి సీసీ కెమెరాలు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రణాళిక బద్ధంగా రాకపోకలను నియంత్రిస్తామన్నారు ఒక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలు ముఖ్యంగా పర్యాటకులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్సవాల్లో 25 వీడియో కెమెరాలు, వినియోగించి అత్యద్భుతంగా ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సముద్ర సారం చేసే పర్యాటకులకు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా మెరైన్, పోలీసు, మత్స్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన సురక్షితమైన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలతో ఈ ప్రాంతం లో (జిడిపి) స్థూల ఆదాయ ఉత్పత్తి పెంచుకునే అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం నగరంలోని అన్ని హోటల్స్, వివిధ రకాల సంఘాలు, మీడియా ప్రతినిధులు పుర ప్రముఖులు అందరూ కూడా ఒక సంఘంగా ఏర్పడి ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ మసుల ఉత్సవాలను ఎంతో ఘనంగా వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కయా కింగ్ ,బీచ్ కబడి వంటి జాతీయ క్రీడలు సాహస క్రీడలు, జల క్రీడలు, హెలి రైడింగులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా ప్రజలకు జాతీయ క్రీడలు తిలకించే మంచి అవకాశం లభించిందన్నారు. ప్రతిరోజు సాయంత్రం అన్ని రకాల సాంస్కృతిక కార్యక్రమాలు

- 2లో

# మన ఊరి పండుగకు ఆహ్వానం

● జాతీయ స్థాయిలో నిర్వహణ ● రాష్ట్ర మంత్రి కొల్లు, ఎంపీ,వల్లభనేని, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల,ఉన్నతాధికారులు హాజరు ● మంగళవారం 2k రన్

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఎంతో చారిత్రాత్మకమైన మచిలీపట్నం మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందబోతుంది. పర్యాటకుల్ని కనువిందు చేసేందుకు, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు అంకురార్పణ జరగబోతుంది. మచిలీపట్నం లో 6,7,8 తేదీల్లో జరగబోయే మసూలా బీచ్ ఫెస్టివల్ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాల శౌరి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, డి సి ఎం ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. పార్టీలకతీతంగా మన ఊరి పండుగ గా నిర్వహించబో తున్నారు. ఈ మసూలా బీచ్ ఫెస్టివల్ కు లక్షల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

**2kరన్....** బీచ్ ఫెస్టివల్ కు జిల్లా ప్రజల్ని ఆహ్వానిస్తూ,మరింత ప్రచారం జరిగేందుకు మంగళవారం ఉదయం 8 గంటలకు కోనేరు సెంటర్ నుంచి 2k రన్ ప్రారంభమై లక్ష్మీ టాకీస్ సెంటర్ వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమం లో నగర వాసులంతా మన ఊరి పండుగ గా భావించి పాల్గొనాలని ,ఈ కార్యక్రమం లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాల శౌరి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, జిల్లా కలెక్టర్ డి కే బాలాజీ,డి సి ఎం ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొంటారని మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ మామిడి మురళీ కృష్ణ తెలిపారు.







# ప్రజా ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలి

–జిల్లా ఎస్పీ ఏ. ఆర్ దామోదర్





**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కరించేందుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక"(మీ కోసం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో వారి సమస్యలను ధైర్యంగా పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. అధికారులు ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, జాబ్ మోసాలు, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి వినయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఆయా ఫిర్యాదుల పై అధికారులు సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి పిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహిళ డిఎస్పీ రమణ కుమార్, సిసియస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్ధన్ రావు , సిబ్బంది పాల్గొన్నారు.

## తోపూరి నరసింహం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు, కలంకౌంటర్ :** లింగసముద్రం మండలం జంపాలవారిపాలెం గ్రామంలో రెండురోజులు క్రితం తోపూరి నరసింహం హత్యకు గురికాగా, ఆయన కుమారుడు రమేష్ ఇతర కుటుంబ సభ్యులను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉదయం పరామర్శించారు.. హత్యకు సంబంధించి, కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు నాగేశ్వరరావు సూచించారు..

## ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన వేగుళ్ళ లీలాకృష్ణ



**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సంస్థ 38 వ చైర్మన్ గా కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ళ లీలాక్రిష్ణ సోమవారం సంస్థ ప్రధాన కార్యాలయం నందు, పదవి భాద్యతలు చేపట్టారు. అనంతరం చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో నీటి పారుదల అభివృద్ధి సంస్థను ముందుకు నడిపించే భాద్యతను అప్పగించినం దుకు కూటమి ప్రభు త్వానికి కృత్ణతలు తెలియచేస్తున్నానన్నారు. తనపై నమ్మకం తో తనకు ఇచ్చిన ఈ బాద్యతను సక్రమంగా నిర్వహిస్తానని, కూటమి ప్రభుత్వం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకు ంటానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు నిమ్మల రామనాయుడు లు సహకారంతో సంస్థను విజయపదంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని తద్వారా రైతులకు కూడా నిస్వార్ధంగా సేవ చేసి, రైతుల అభివృద్ధికి దోహదపడతానని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన టువంటి రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదేండ్ల మనోహర్ మాట్లాడుతూ ముందుగా చైర్మన్ గా భాద్యతలు చేపట్టిన వేగుళ్ల లీలా కృష్ణను అభినందిస్తూ,గత కొన్ని సంవత్సరాలుగా లీలా కృష్ణ ప్రజలకు చేసిన సేవలకు మరియు తన కష్టానికి తగిన గుర్తింపు లబించినందుకు సంతోషంగా ఉందని భవిస్యతులో మరిన్ని పదవులు చేప్పట్టి ప్రజలకు సేవనందించాలన్నారు. అనంతరం రాష్ట్ర కార్మిక మరియు ఫ్యాక్టరీలు శాఖమాత్యులు వాసంశెట్టి సుభాష్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాధ్ (చిన్ని), గుడివాడ శాసన సభ్యులు వెనిగండ్ల రాము, మండపేట శాసన సభ్యులు వేగుళ్ల జోగేశ్వర రావు, కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యనారాయణ రావు , మరియు ఇతర నాయకులు ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా బాధ్యతలు చెప్పట్టినం దుకు వేగుళ్ల లీలా కృష్ణకు అభినందనలను తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ఏ. పి. యస్. ఐ. డి. సి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శేషం తిరుమల రావు గారు మరియు ఇతర అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా..

- కే.ఎస్. జవహర్ చైర్మన్ రాష్ట్ర ఎస్సీ కమిషన్







**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేవీస్ జవహర్ అన్నారు. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ 4వ ఫ్లోర్ గల ఎస్సీ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ గా కుటుంబ సభ్యుల మధ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నాకు చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు.. రాష్ట్రంలోని ఎస్సీల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని పనిచేస్తానన్నారు.. గతంలో ఎన్నడూ లేనివిధగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.. రాష్ట్రం లోని దళితులందరూ కూటమి పాలనలో ఏంతో సంతోషంగా ఉన్నారని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలేనన్నారు. గతంలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెరిగాయన్నారు.. రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా కమిషన్ పనిచేస్తుందన్నారు.. సమసమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి నాయకత్వంలో పనిచేయడం చాలా సంతోషంగా ఉందని చైర్మన్ కేఎస్ జవహర్ తెలిపారు. ముందుగా ఆర్టీసీ మాజీ చైర్మన్ వర్ల రామయ్య మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్ గా కేఎస్ జవహర్ ను నియమించటం దళితులందరికీ సంతోషదాయకమన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం శాసనసభ్యులు నక్కా ఆనంద బాబు, ఎమ్మెస్ రాజు, బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా లు పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ బత్తుల జీవపుత్ర కుమార్, చైర్మన్ పీ.ఎస్ ఎల్.ఎమ్ కిషోర్, తదితరలు పాల్గొన్నారు. అనంతరం తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన అభినంధన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, శాసనసభ్యులు బండారు సత్యానందరావు, తంగిరాల సౌమ్య, వేగుళ్ల జోగేశ్వరావు, పితాని సత్యారాయణ, ఎస్సీ మాల సంక్షేమ సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని చైర్మన్ ను బొకేలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# జెఈఈ అడ్వాన్స్ ఫలితాలలో మెరిసిన ఆణి ముత్యాలు





**ఆగిరిపల్లి (ఎన్ టి ఆర్ జిల్లా),కలంకౌంటర్ :** చదువులో అంకిత భావం ఓర్పు పట్టుదలగా ప్రయత్నించాలే గాని అద్భుతమైన విజయాలు సాధించవచ్చునని ఆగిరిపల్లి మండల విద్యార్థులు నిరూపించారు . అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి విద్యార్థులు పడిన శ్రమ చేసిన కృషి గురించి తెలుసుకుంటే ఈ మాటలు అక్షర సత్యాలు అంటారు, దాని ఫలితం 2025 జూన్ 2 న విడుదల అయిన జేఈఈ అడ్వాన్స్ లో అగిరిపల్లి మండలమునకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఆల్ ఇండియా 255 మరియు 471 వ ర్యాంక్ లు సాధించారు ఒకరు ఆగిరిపల్లి వర్తక సంఘం చాంబర్ అధ్యక్షులు మానేపల్లి జగదీశ్వరరావు మనవడు సాయి సుమేద్ మరి ఒకరు మారుమూల గ్రామమైన చొప్పరమెట్ల గ్రామానికి చెందిన కోట మంజునాథ్ .2025 జెఈఈ అడ్వాన్స్ ఫలితాలలో ఆలిండియా 255మరియు 471ర్యాంకు సాధించారు. ఆగిరిపల్లి గ్రామంలోని మానేపల్లి కృష్ణనాథ్ మరియు సునీత దంపతుల కుమారుడు సాయి సుమేద్ బెంగళూరులోని నారాయణ కాలేజీలో విద్యను అభ్యసించి 255 వ ర్యాంకు సాధించగా ఆగిరిపల్లి మండలం చొప్పరమట్ల గ్రామానికి చెందిన కోట రవి , నాగపూర్ణిమ దంపతుల కుమారుడు కోట మంజునాథ్ 10వ తరగతి జవహర్ నవోదయ స్కూల్లో చదివి 447/500 మార్కులు సాధించాడు. తరువాత ఇంటర్మీడియట్ స్థానిక డాక్టర్ కేకేఆర్ హ్యాపీవ్యాలీ స్కూల్లో ఉచిత విద్య ప్రోగ్రామ్ ద్వారాచదవాడు. ఈ సందర్భంగా నాగ పూర్ణిమ మాట్లాడుతూ తమ కుమారుడైన మంజునాథ్ ఉన్నత చదువులకై హ్యాపీ వేల్యూ స్కూల్ యాజమాన్యాన్ని సంప్రదించగా కేకేఆర్ స్కూల్ అధినేత అయిన కొసరాజు కోటేశ్వరరావు మంజునాద్ లోని ప్రతిభను గుర్తించి ఉచితంగా సీటు వసతి ఇవ్వడంతోపాటు ఐఐటి జేఈఈ కి సంబంధించి క్లాసులను కూడా ఉచితంగా అందించడం జరిగిందని, స్కూల్ యాజమాన్యం, అధ్యాపకులు తమ ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించగలిగాడని తెలిపారు . మంజునాథ్ మాట్లాడుతూ తనకి ఇష్టమైన సివిల్స్ సాధించి సమాజ సేవ చేయాలని తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఇంతటి విజయాన్ని సాధించిన మంజునాథ్ ను స్కూల్ యాజమాన్యం, అధ్యాపక బృందం,సహచర విద్యార్థులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు. సాయి సుమేధను సంప్రదించగా తనకు పదవ తరగతిలో 492, ఇంటర్మీడియట్లో 491(500 మార్కులకు గాను ) మార్కులు వచ్చాయని,భవిష్యత్తులో తనకు ఇష్టమైన స్పేస్ ఇంజనీరింగ్ (రాకెట్) చదివి రాకెట్ సైంటిస్ట్ కావాలని తన ఆకాంక్ష అని తెలిపాడు. సాయి సుమేధ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 255 వ ర్యాంకు సాధించడంపై మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చలువాది వెంకటరత్నం, మానేపల్లి జగదీశ్వరరావు, టీ మురళి, మానేపల్లి శ్రీనివాస్, మడుపల్లి గోపాల్, వై ప్రణీత్, వై సుధీర్, కే శ్రీనివాస్ తదితరులు అభినందిస్తున్నారు.

# కార్యకర్తలే పార్టీకి వెన్నుముక



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** మునేశ్వరరావు లాంటి కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి వెన్నుముక అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. కడపలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి కోడూరు మండలం నుంచి దాదాపు 388 కిలోమీటర్ల సైకిల్ పై వెళ్లిన ధూళిపూడి మునేశ్వరరావును సోమవారం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతోమంది కార్యకర్తల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే వైసీపీ అరాచక పాలన అంతమైందని అన్నారు. వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు పతనమయ్యాయని, రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. ప్రజలు రాజారెడ్డి రాజ్యాంగానికి వ్యతిరేకంగా గడచిన ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తే బుద్ధి తెచ్చుకోకుండా ప్రజల తీర్పును అపహాస్యం చేసేలా వెన్నుపోటు దినం అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తు న్నారని, ప్రజలకు అన్నివిధాలా వెన్నుపోటు పొడిచింది జగన్మోహనరెడ్డి అని నమ్మే ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేశారని ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోకుంటే ప్రజలు ఆ పార్టీని పూర్తిగా భూస్థాపితం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మెండు లక్ష్మణరావు, బండే శ్రీనివాసరావు, కర్రా సుధాకర్,మండలి రామ్మోహన్ రావు,పిల్లి మల్లికార్జున రావు, పరిశే మౌళి,ఉప్పల ప్రసాద్, దాసినేని శ్రీనివాసరావు, దాసినేని సాంబయ్య, కొండవేటి మధు,మేడికొండ విజయ్,కోట సాయి, గుంటూరు వినయ్,మట్టా నర్సయ్య, చిల్లిముంత శ్రీనివాసరావు,యార్లగడ్డ శేష, మోతుకూరి అంకలరావు,ఒగ్గు కోటయ్య,కాకర్ల దుర్గా నాగేశ్వరరావు,శొంటి శివయ్య,యార్లగడ్డ రుక్మేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్..

- కార్యస్థానం పనులను త్వరితగతిన పూర్తిచేయండి
- అధికారులకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలు






**విజయవాడ,కలంకౌంటర్ :** స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో సరికొత్త ఊపు రానుందని.. ఈ హబ్‌తో పారిశ్రామిక రంగం రూపురేఖలు సమూలంగా మారను న్నాయని.. ఇందుకు సంబంధించి విజయవాడ స్పోక్ కార్యాలయ పనులను త్వరితగతిన పూర్తిచేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం టాటా ఇన్నొవేషన్ హబ్ – స్పోక్ కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన కార్యాలయం, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఎనికేపాడులోని ఓ భవనాన్ని కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌టీఐహెచ్ కార్యకలాపాలను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నాలుగైదు రోజుల్లో నాలుగో అంతస్తులోని ఒక బ్లాకు పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. స్టార్టప్, ఆవిష్కరణల వ్యవస్థలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ విధానాలను అమలుచేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రభుత్వం అమరావతిలో రతన్ టాట్ ఇన్నొవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా ఈ హబ్‌కు అనుసంధానంగా విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపూర్‌లో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్య సాధనకు, స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనికతను సాకారం చేయడంలో ఇన్నొవేషన్ హబ్ కీలకంగా నిలవనుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, తహసీల్దారు బి.సుగుణ, ఆర్ అండ్ బీ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లేరు ప్రజల సమస్యకు మానవీయ కోణంలో పరిష్కారం

- ముఖ్యమంత్రి చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

కార్యాచరణ ఉండాలన్నారు. ప్రతి ఏడాది కనీసం 1.5 శాతం మేర గ్రీన్ కవర్ పెరగాలన్నారు. సీఆర్డీఏ పరిధిలో ఫారెస్ట్‌తో కలిపి ఎంత గ్రీన్ కవర్ ఉందో స్పష్టమైన సమాచారం శాటిలైట్ల సాయంతో సేకరించాలని, అలాగే ప్రతీ ప్లాంట్‌ను ట్యాగ్ చేయాలన్నారు. రాష్ట్రం ఆహ్లాదకరంగా పచ్చదనంతో ఉండాలని, మొక్కలు నాటి వదిలేయడం కాకుండా వాటిని పరిరక్షించే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పచ్చదనం పెంచేందుకు అవసరమైతే సామాజిక బాధ్యత కింద కార్పొరేట్ సంస్థలు ముందుకువస్తే వారికి అవకాశం కల్పించే విధానం తీసుకురావాలని సూచించారు. అమరావతి పరిధిలోని అన్ని రిజర్వ్ అటవీ ప్రాంతాలను మియావకీ తరహాలో పచ్చదనం పెంచి, 3 ఏళ్లలో ఫలితాలు కనబడాలన్నారు.

# జాతీయ స్థాయిలో మసూలా బీచ్ ఫెస్టివల్

(మొదటి పేజీ తరువాయి)

ఉంటాయన్నారు. ముఖ్యంగా కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలంకారి చేనేత వస్త్రాలు ఏర్పాటు చేస్తున్నామని తద్వారా చేనేతలకు మంచి మార్కెటింగ్ లభిస్తుందన్నారు. జిల్లా ఎస్పీ గంగాధర్ రావు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తం 1000 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో నియమిస్తున్నామన్నారు. మంగినపూడి బీచ్ పరిసరాలను పూర్తిగా పరిశీలించి వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగా పక్కా ప్రణాళిక, రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. మొత్తం 4 చోట్ల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల అవగాహన కోసం వాహనాల రూట్ మ్యాప్ ముందుగా పత్రికలకు విడుదల చేస్తామన్నారు. అమరావతి ముఖద్వారం ఐకానిక్ నిర్మాణం, 100 అడుగుల జాతీయ పతాకము ఏర్పాటు బీచ్ ఉత్సవాలతో ప్రతి వారాంతపు సెలవు రోజుల్లో రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా వెలుగొందుతుందన్నారు. ఈ బీచ్ ఉత్సవాలు అందరి మదిలో జీవితాంతం గుర్తుండిపోయే విధంగా అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. బీచ్ కు వచ్చే వారందరూ మన అతిధులని వారికి సాధార పూర్వకంగా ఆహ్వానం పలికి అతిథ్యం ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ సాయిబాబు, తహసిల్దారు హరినాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, స్థానిక ప్రముఖులు కుంచే దుర్గాప్రసాద్, రొండి కృష్ణ, డాక్టర్ ధన్వంతరాచారి, ఆర్ట్ డైరెక్టర్ రమణ వంక తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# సైకో పాలన విమోచన దినంగా 4వ తేది ప్రజలు జరుపుకుంటారు.

-రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి అర్వపల్లి అంజనేయులు



**అమరావతి, కలంకౌంటర్ :** జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా ప్రకటించిన వైసిపి నాయకులపై అంజ నేయులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జూన్ 4వ తేదీ సైకోపాలన విమోచన దినంగా గా రాష్ట్ర ప్రజలందరూ ఓ పండుగలా జరుపుకోవడానికి సిద్ధమయ్యారని అన్నారు. వైసిపి హయాంలో జరిగిన దౌర్జన్యాలు కుంభకోణాలు దారుణలు హత్యలు విధ్వంసకర కార్యకలాపాలను ప్రజలకు గుర్తుచేస్తూ బాబయి గొడ్డలి పోటు దినం, సొంత చెల్లిని తల్లి ని గెంటేసిన దినం అమ్మ మీద కేసు పెట్టిన దినం, వంటివి ఎప్పుడు నిర్వహిస్తారో కూడ చెప్పాలని అన్నారు వైసిపి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని సైకో,శాడిస్ట్ పాలన నుంచి విముక్తి కోరుతూ ఓటు వేసి తీర్పు ఇచ్చారు ప్రజలు జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా ఎలా ప్రకటిస్తారని వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ కుంభకోణాల నుంచి రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చేందుకే జగన్రెడ్డి ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ప్రస్తుతం ప్రజరంజక పాలన ను చూసి ఓర్వలేకనే వైసిపినేతలుఇలాంటి విచేస్తున్నారని ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్ష హెూదా రాకుండా 11 సీట్లకే పరిమితం చేసి స్పష్టమై న తీర్పు ఇచ్చినా వైసిపి అధినేత జగన్‌కు ఆపార్టీ నాయకులకు ఇంకా సిగ్గుబుద్ధి రాలే దని అంజనేయులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# మౌనిక స్టూడియో వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణంలో పామూరు రోడ్డు నందు ఉన్న మౌనిక స్టూడియో, ఫ్లెక్స్ ప్రింటింగ్ 30 వ వార్షికోత్సవంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మౌనిక స్టూడియో లో నూతన మినీ ప్రింటింగ్ మిషన్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు, స్టూడియో వారు ఏర్పాటుచేసిన కేకును ఎమ్మెల్యే కట్ చేసి యాజమాన్యానికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి నిర్వాహకులు మౌనిక స్టూడియో యజమాని ద్రోణాదుల అశోక్ ఎమ్మెల్యే నాగేశ్వరరావు కి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ధామల్లేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, ఉన్నం లక్ష్మీనరసింహ, తెలుగుదేశం పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసులు, ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర్, విపిజి సుకుమార్ గుప్తా, చక్కా కేశవ, తెలుగు మహిళలు కల్లూరు శైలజ, మన్నం శైలజ, అల్లం సుమతి, కంసాని మయూరి పాల్గొన్నారు.

# కారుమూరి కి కృతజ్ఞతలు తెలిపిన రోశయ్య




**తణుకు,కలంకౌంటర్ :** మాజీ మంత్రి, వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, తణుకు నియోజకవర్గ సమన్వయకర్త డా. కారుమూరి వెంకట నాగేశ్వరరావు ని. మర్యాద పూర్వకంగా కలిసిన వైసీపీ స్టేట్ వాణిజ్య విభాగం జోనల్ ప్రెసిడెంట్ కంకటాల నాగ సత్యనారాయణ (అత్తిలి రోశయ్య ) తనపై నమ్మకం తో పదవి ఇప్పించిన కారుమూరి నాగేశ్వరావు కి కృతజ్ఞతలు తెలిపిన రోశయ్య.

# భళా.. భద్రిరాజు..భళా

### -జేఈఈ అడ్వాన్స్‌లో భద్రిరాజు వేంకట మణి ప్రీతమ్ కు ఆల్ ఇండియా 234 ర్యాంకు



**కందుకూరు,కలంకౌంటర్ :** నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన భద్రిరాజు వెంకట మణి ప్రీతమ్ కు సోమవారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీ లో 234 ర్యాంక్ సాధించాడు. ప్రీతమ్ తల్లి తండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. భద్రిరాజు నారాయణ మూర్తి గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు,రజని ముండ్లమూరివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు.ప్రీతమ్ తాతగారు కీ.శే. భద్రిరాజు లక్ష్మీ నరసింహారావు కూడా టీచర్ గా అందరికి సుపరిచితులు. తమ కుమారుడికి 234 ర్యాంకు రావడం పట్ల ప్రీతమ్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.వారి బంధువులు స్నేహితులు, వారితోపాటు ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మెన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, మంచిరాజు మురళీమోహన్, గాయత్రి రామకృష్ణ, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# లేపాక్షి చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

### - హస్తకళల అభివృద్ధి పవన్ కళ్యాణ్ అకాంక్ష : నాదెండ్ల మనోహర్




**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ హస్త కళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఛైర్మన్ గా తిరుపతి జనసేన నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సోమవారం బాధ్య తలు స్వీకరించారు. విజయవాడ లేపాక్షి కేంద్ర కార్యాల యంలో కుటుంబ సభ్యులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి కార్యకర్యల సమక్షంలో సందడిగా ఈ కార్యక్రమం జరిగి ంది. సంస్థ ఎండి విశ్వ మనోహరన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహింపచేసి సంస్థ గురించి నూతన ఛైర్మన్ కు వివరించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ హస్తకళల పట్ల ఎంతో మక్కువ కలిగిన తమ అధినేత పవన్ కళ్యాణ్ తనకు ఈ అవకాశం కల్పించటం తన భాధ్యతలను పెంచిందన్నారు. ఎన్ డిఎ ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయిడు స్ఫూర్తితో హస్తకళాకారుల ఉన్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. లేపాక్షి ప్రదర్శన శాలలను విస్తరింపచేసి విక్రయాలు పెరిగేలా ప్రయత్నిస్తా మన్నారు. కనుమరుగవుతున్న కళలకు జీవం పోసేలా ఆసక్తి కలిగిన యువతకు ప్రత్యేక శిక్షణలు ఏర్పాటు చేసి వారిని కళాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హరి ప్రసాద్ తెలిపారు. లేపాక్షి ఉన్నతికి , ఆర్థిక పురోగమనానికి తనకున్న రెండు సంవత్సరాల కాలాన్ని సద్వినియోగం చేసుకుంటానని పసుపులేటి పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా హాజరైన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ హరిప్రసాద్ ఏ బాధ్యతలు అప్పగించినా సమర్ధ వంతంగా పనిచేస్తార న్నారు. హస్తకళల పట్ల ప్రత్యేక అభిమానాన్ని ప్రదర్శించే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అను గుణంగా పసుపులేటి వ్యవహరించి లేపాక్షి ఉన్నతి కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా ఉన్న హస్తకళలకు దేశ విదేశాలలో ప్రాచుర్యం లభించేలా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తామన్నారు. హస్తకళలు, చేనేతలకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని దానిని అందిపుచ్చుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. పర్యాటక ప్రదేశాలలో లేపాక్షి ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేయటం ద్వారా గణనీయమైన ఆదాయం పొందగలమన్నారు. ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి హజరైన వారిలో విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు, తాడేపల్లి గూడెం శాసన సభ్యులు బోలిశెట్టి శ్రీనివాసులు, మాజీ ఎంఎల్ ఎ కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, ఎపి హెచ్ ఎం ఐడిసి ఛైర్మన్ శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి స-ుబ్బారాయిడు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల డిసిఎంఎస్ ఛైర్మన్ లు బండి రామకృష్ణ, మురళి కృష్ణ, జనసేన గుంటూరు, కృష్ణా, ఎన్ టిఆర్ జిల్లాల అధ్యక్షులు గాదె వెంకటేశ్వర్లు, బండ్రెడ్డి రామకృష్ణ, అమ్మిశెట్టి వాసు, కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు వేల్పూరి శ్రీనివాసరావు, కడప టిడిపి నేత హరిప్రసాద్, జనసేన నాయకులు ఘంటా స్వరూప, కీర్తన తదితరులు ఉన్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, వీరమహిళలు, లీగల్ సెల్ సభ్యులు, పూర్వపు చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల నేతలు, అభిమానులు హాజరుకాగా, తొలుత ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. లేపాక్షి అధికారులు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.



# మీ కడుపు చల్లగుండాలి .....దాతలకు దీవెనలు








**మచిలీపట్నం,కలంకౌంటర్ :** వంద రూపాయలు ఖర్చు పెట్టి పది వేలు పబ్లిసిటీ చేసుకునే రోజుల్లో కూడా ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సంస్థల పనితీరు ఆదర్శంగా నిలుస్తోంది. వేసవి కాలంలో అందరికీ ఉపశమనం కలిగించే విధంగా వివిధ ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలకు పలువురు మీ కడుపు చల్లగుండాలి అంటూ దీవిస్తున్నారు. నగరంలో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద,వాకర్స్ అసోసియేషన్, అవోపా,వాసవి క్లబ్స్, శ్రీ ధర్మ శాస్తా భక్త బృందం ఆద్వర్యంలో అయ్యప్ప దేవస్థానం వద్ద ..ఇలా ఎన్నో సంస్థలు, వ్యాపార సంస్థలు,వ్యక్తులు సైతం వివిధ ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. నగరంలో సేవాభావం పరిఢవిల్లుతోంది. దాతల దాతృత్వానికి ప్రశంసలు లభిస్తున్నాయి.

# ఏడాదిన్నరలో తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు

### -రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు






**హైదరాబాద్,కలంకౌంటర్ :** భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్దే లక్ష్యంగా జపాన్ లోని "కితాక్యూషూ సిటీ" స్ఫూర్తితో రాష్ట్రంలో 80 ఎకరాల్లో ఎకో టౌన్ ను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. తెలంగాణ, కితాక్యూషూ నగరం మధ్య కుదిరిన పరస్పర సహకార ఒప్పందం ఇందుకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సోమవారం టీహబ్ లో "ఫ్రం కితాక్యూషూ టూ తెలంగాణ: కేటలైసింగ్ సస్టైనబుల్ ఇండస్ట్రియల్ గ్రోత్ అనే అంశంపై సోమ వారం రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "తెలంగాణ రైజింగ్ 2047" అనే లక్ష్యంతో అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా మార్చాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రానికి సుమారు రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చేందుకు మా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్ లాంటి అనేక అంతర్జాతీయ స్థాయి కంపెనీలు హైదరాబాద్ లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జపాన్ కంపెనీలు మరిన్ని పెట్టుబడులు పెట్టేలా ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇప్పటికే తెలంగాణకు చెందిన 50 మంది యువతకు జపాన్ లో ఉపాధి అవకాశాలు లభించాయని, మరింత మందికి దక్కేలా టాంకాం లాంటి ప్రభుత్వ సంస్థల ద్వారా జపనీస్ భాషను నేర్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో నెట్ జీరో లక్ష్యాలు, రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్, సర్క్యులర్ ఎకానమీ, క్లీన్ టెక్నాలజీస్, డిజిటల్ ఇన్నోవేషన్ తదితర అంశాల్లో కితాక్యూషూ నగరంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీని పర్యావరణహితంగా తీర్చి దిద్దేందుకు ఇండస్ట్రియల్ జోన్స్ ఏర్పాటు, జీరో వేస్ట్ డిజైన్, అత్యాధునిక వాటర్ అండ్ వేస్ట్ మేనేజ్మెంట్ పద్ధతులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. తెలంగాణ, కితాక్యూషూ నగరం మధ్య సత్సంబంధాలు మరింత పెరిగేలా హైదరాబాద్ నుంచి నేరుగా విమాన సర్వీసులను నడిపేందుకు గల సాధ్య సాధ్యాలపై అధ్యయనం చేయిస్తామన్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా జపాన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, కితాక్యూషూ నగర మేయర్ కజుహిసా టకేచీ, టీజీఐఐసీ ఎండీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, రాష్ట్ర ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ సెల్ డైరెక్టర్ అవినాష్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 117 అర్జీలు

### ● అర్జీల సత్వర పరిష్కారంతో పాటు నాణ్యతా ప్రధానం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 117 అర్జీలు వచ్చాయని, అర్జీలను సత్వరం పరిష్కరించడం ఎంత ప్రధానమో నాణ్యతతో పరిష్కరించడం అంతకంటే ముఖ్యమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ.. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి. జ్యోతితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 117 అర్జీలు రాగా వీటిలో రెవెన్యూ సేవలకు సంబంధించి 40 అర్జీలు, పోలీస్ శాఖకు 16, మునిసిపల్, పట్టణాభివృద్ధికి 15 అర్జీలు వచ్చాయి. పౌర సరఫరాలు, పంచాయతీరాజ్ విభాగాలకు సంబంధించి ఏడు చొప్పున అర్జీలు రాగా బీసీ కార్పొరేషన్‌కు అయిదు అర్జీలు వచ్చాయి. ఏపీఎస్ఆర్‌టీసీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, గృహ నిర్మాణం, మార్కెటింగ్, సర్వే విభాగాలకు మూడు చొప్పున అర్జీలు వచ్చాయి. ఏపీసీపీడీసీఎల్, సహకారం, ఆరోగ్యం, ఇరిగేషన్ శాఖలకు రెండు చొప్పున అర్జీలు రాగా, డీఆర్‌డీఏ, ఉపాధికల్పన, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, రవాణా శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని నిర్దిష్ట గడువులోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్య పరిష్కారం అనేది స్వర్ణాంధ్ర సాకారానికి పునాది కాగలదని, ఈ విషయాన్ని గమనించి అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తో కలిసి వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుళ్ళ రామక్రష్ణ సుమారు 8 కోట్ల రూపాయలతో నిర్మించిన అరుణాచలేశ్వర స్వామి ఆర్యవైశ్య వాసవి నిత్య అన్నదాన సత్రం ట్రస్ట్ అరుణాచలం నూతన భవనాన్ని ప్రారంభించారు.

–అరుణాచలం,కలంకౌంటర్:

# అవార్డు గ్రహీత లకు శుభాకాంక్షలు వెల్లువ





**విజయవాడ,కలంకౌంటర్**: వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందిన వారికి ఇచ్చే స్వర్గీయ నందమూరి తారక రామారావు స్మారక అవార్డును ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల ముత్యప్రసాద్, ఎన్ టి ఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాళ్ళ చిన్న సత్యంబాబు,చందర్లపాడు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చక్కా రాధాకృష్ణ లు అతిరథ మహారథులు చేతులు మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత లకు రాష్ట్ర వ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వివిధ సంఘాల నాయకులు,ప్రముఖులు,వ్యాపార సంఘాలు,పలు రాజకీయ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



# సేవకుడికి పురస్కారం





**రాజమహేంద్రవరం,కలంకౌంటర్**: ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ తన వంతు సమాజ హితం కోసం కృషి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ కు నల్లమిల్లి రామ కోటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమం లో ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారావు, ట్రస్ట్ సభ్యులు,ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత చిన్ని రామ సత్యనారాయణ కు రాష్ట్రంలో పలువురు ప్రముఖులు,వివిధ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.


# పేదల్ని ఆదుకోండి





**మచిలీపట్నం,కలంకౌంటర్** : మచిలీపట్నం నియోజకవర్గ సిపిఐ సమితి ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం నిమిత్తం ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని ఇచ్చిన సూపర్ సిక్స్ హామీని వెంటనే నెరవేర్చాలని అన్ని మండల కార్యాలయాల వద్దజరు పతలపెట్టిన ధర్నా కార్యక్రమంలో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో తహసిల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ సత్యనారాయణ కి వినతి పత్రం అందజేశారు. ధర్నా ను ఉద్దేశించి నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి జి గగన్ ఒ డుగు చైతన్య కుమార్ సీనియర్ నాయకురాలు దేవ భక్తుని నిర్మల సిపిఐ నాయకులు ఎర్రం శెట్టి ఈశ్వరరావు, మహిళా సమైక్య నాయకురాలు ఒడుగు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

VAARAHI
— SILKS —
Threads of Luxury, Woven with love...



Patola Banaras | Kanjeevaram | Paithani | Organza | Chikankari | Soft Pattu | Muslin
Bandhini | Kanchi Tissue | Crush Tissue | Designer Tussar | Georgette | Fancy | Ikkat
VAARAHI SILKS Ph. 91000 03343 | www.vaarahisilks.com
Road No. 36, Jubilee Hills | Road No.1, Kukatpally.
SCAN TO FOLLOW US ON
INSTAGRAM FACEBOOK

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com